## క్లుప్తంగా

### సిరులతల్లికి పంచామృతాభిషేకం



పంచామృతాభిషేక సేవలో కనకమహాలక్ష్మి

**దాబాగార్డెన్స్:** బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో గురువారం త్రికాల పంచామృతాభిషేకం జరిపారు. ఈ సేవలో పలువురు ఉభయ దాతలు పాల్గొన్నారు. ఈ పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,000 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శోభారాణి, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### నేడు సీతారామచంద్రస్వామి ఉత్తర ద్వార దర్శనం



**దాబాగార్డెన్స్:** ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకుని మహారాణిపేట అంబికాబాగ్‌లో వేంచేసిన సీతారామచంద్రస్వామి శుక్రవారం భక్తులకు ఉత్తర ద్వారంలో దర్శనం ఇవ్వనున్నారని ఆలయ ఈవో కె. శోభారాణి తెలిపారు. ఉదయం 5 నుంచి 12.30 గంటల వరకు ఉత్తర ద్వార దర్శనాలు ఉంటాయని ఆమె పేర్కొన్నారు. ఏకాదశి రోజున మూడు కోట్ల మంది దేవతలు స్వామిని ఆరాధిస్తారని, అందుకే ఆ రోజు ముక్కోటి ఏకాదశి అని అంటారని శోభారాణి తెలిపారు. ఆరోజు మహావిష్ణువు ఉత్తర ద్వారం ద్వారా భక్తులకు దర్శనం ఇస్తారన్నారు.


### ముక్కోటి ఏకాదశికి ఏర్పాట్లు పూర్తి

**దాబాగార్డెన్స్:** ముక్కోటి ఏకాదశి మహా పర్వదినాన్ని పురస్కరించుకుని టౌన్ కొత్తరోడ్డులో వేంచేసిన జగన్నాథస్వామి ఆలయంలో శుక్రవారం ఉదయం 5 గంటల నుంచి ఉత్తర ద్వార (వైకుంఠద్వార) దర్శనం ఉంటుందని ఆలయ ఈవో రాజగోపాల్‌రెడ్డి తెలిపారు. యావన్మంది భక్తులు ఉత్తరద్వార దర్శనంలో స్వామిని దర్శించుకోవాలని కోరారు.

**11న మహాలక్ష్మికి కూడారై ఉత్సవం..**

ఈ నెల 11 ఉదయం 9 గంటల నుంచి మహాలక్ష్మి దేవికి కూడారై ఉత్సవం సందర్భంగా పంచామృతాభిషేకం, కలువ పూలతో సహస్రనామార్చన, 108 కుండల్లో క్షీరాన్న నివేదన, హారతి కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు ఈవో తెలిపారు. 13 ఉదయం 9 గంటల నుంచి గోదాదేవి కల్యాణం అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్టు తెలిపారు. ఉత్సవంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొనాలని కోరారు.

### మహిళా కళాశాలలో ఉద్యోగ మేళా



విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ డాక్టర్ మంజుల

**దాబాగార్డెన్స్:** విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో గురువారం క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించారు. కళాశాల జవహర్ నాలెడ్జ్ సెంటర్ (జేకేసీ), శ్రీచైతన్య విద్యా సంస్థలు సంయుక్తంగా ప్రాంగణ నియామకాలు, ఉద్యోగ మేళా నిర్వహించాయి. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ డాక్టర్ ఆర్. మంజుల మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి ప్రాముఖ్యతను వివరించారు. నైపుణ్యంతో కూడిన వృత్తి, ఉపాధి అవకాశాలు పొందే మార్గాన్ని సూచించారు. కళాశాలలో నిర్వహించిన రాతపరీక్ష, ఇంటర్వ్యూలో 20 మంది విద్యార్థినులు అర్హత పొంది ఉద్యోగ అవకాశాన్ని సాధించారు. కార్యక్రమంలో జేకేసీ కో ఆర్డినేటర్ విద్యా కల్పన, ప్రజ్ఞ, శ్రీచైతన్య విద్యా సంస్థల కో ఆర్డినేటర్ రామారావు, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



# అద్దె జాస్తి.. మరమ్మతులు నాస్తి

గుర్రం గుడ్డిదైనా దాణా తప్పదన్నట్టుగా ఉంది జీవీఎంసీ దుకాణ సముదాయాల దుస్థితి. ఇప్పుడు గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్ ఒకప్పుడు మున్సిపల్ కార్పొరేషన్‌గా ఉన్న సమయంలో దుకాణ సముదాయాలు నిర్మించింది. అయితే ఎన్నో ఏళ్లు కావస్తున్నా వాటికి కనీసం మరమ్మతులు చేసిన సందర్భాలు కూడా లేవు. కానీ ప్రతి ఏటా జీవీఎంసీ నిర్వహించే వేలం పాటలో ఆయా దుకాణ సముదాయలకు వేలం వేస్తున్నారు. ప్రతి మూడేళ్లకు అద్దెలు పెంచుతున్నారు.

**కూలేందుకు సిద్ధంగా జీవీఎంసీ దుకాణాలు**

అయినా వేలం వేస్తున్న అధికారులు

ప్రతి రెన్యువల్‌లోనూ 33 శాతం అద్దె పెంపు నిబంధన





స్ప్రింగ్ రోడ్డులో శిథిలావస్థలో ఉన్న జీవీఎంసీ దుకాణ సముదాయం (పైఅంతస్తు)



డయాస్ ట్యాంక్ వద్ద శిథిలావస్థలో ఉన్న దుకాణ సముదాయం



జీవీఎంసీ కార్యాలయం ఎదురుగా శిథిలమైన దుకాణం

- కనీస సదుపాయాలైన తాగునీరు.. మరుగుదొడ్లు మృగ్యం
- సతమతమవుతున్న వ్యాపారులు

**జగదాంబ:** జీవీఎంసీ 35వ వార్డులో డయాస్ ట్యాంక్ వద్ద 1 నుంచి 16 దుకాణాలు కింది అంతస్తులోను, మరో 16 దుకాణాలు మొదటి అంతస్తులోను ఉన్నాయి. వీటిలో అన్ని దుకాణాలకు ఏటా జీవీఎంసీ వేలం నిర్వహిస్తుంటుంది. కానీ కింది అంతస్తులోని 1 నుంచి 8 దుకాణాలకు మాత్రమే వ్యాపారులు వేలం పాడి ఆ దుకాణాలను పొందుతూ ఉంటారు. మిగిలిన దుకాణాలు శిథిలావస్థకు చేరుకోవడం వల్ల వాటిని తీసుకుని వ్యాపారాలు చేసుకోవడానికి ఎవరూ ముందుకు రావడంలేదు. వీటికి మరమ్మతులు చేసి అద్దె ప్రాతిపదికన ఇచ్చేందుకు జీవీఎంసీ ఏనాడూ ప్రయత్నించలేదని వ్యాపారులు అంటున్నారు. పైగా ఈ దుకాణాలు నేడో రేపో కూలిపోయేందుకు సిద్ధంగా ఉన్నాయని చెబుతున్నారు. వీటిలో రెండు మూడు దుకాణాలు కాస్త బాగున్నా వాటికి అడ్డంగా జీవీఎంసీ వాటర్ ట్యాంక్ ఉండడంతో ఆ దుకాణాలను తీసుకోవడానికి కూడా ఎవరూ ముందుకు రావడంలేదు. ఇదే కోవలో జీవీఎంసీ ఫ్రూట్ మార్కెట్ వద్ద కూడా దుకాణ సముదాయం ఉంది. ఇందులో కూడా పదిహేను దుకాణాలు ఉన్నాయి. ఇవన్నీ ఫ్రూట్ మార్కెట్ దుకాణాలకు వెనుక భాగంలో ఉండడంతో అవి ఉన్నా లేనట్టుగానే భావించాల్సి వస్తోంది. ఆ దుకాణ సముదాయం బయటికి కనిపించకుండా ఉండడంతో వ్యాపారులు వాటి పట్ల ఆసక్తి చూపడంలేదు. వాటిని అలాగే వదిలేయడంతో అవి కూడా శిథిలావస్థకు చేరుకున్నాయి.

అలాగే టీఎస్ఆర్ దుకాణ సముదాయం పరిస్థితి కూడా ఇలాగే ఉంది. ఇందులో కూడా కింది అంతస్తులో మాత్రమే దుకాణాల నిర్వాహణ జరుగుతోంది. మొదటి, రెండవ అంతస్తులో దుకాణాలు శిథిలమై నిరుపయోగంగా ఉన్నాయి. అయినా జీవీఎంసీ టెండర్ వేసి వేలం పాటకు పిలుస్తుండడం గమనార్హం.

**ఇబ్బందికరంగా రెన్యువల్ నిబంధన..**

ఇదిలా ఉండగా జీవీఎంసీ నిబంధనల ప్రకారం దుకాణాల అద్దెలను ప్రతి రెన్యువల్‌లోనూ 33 శాతం పెంచుతూ ఉండడం పీకమీద కత్తిలా ఉందని వ్యాపారులు వాపోతున్నారు. శిథిలమవుతున్న ఆ దుకాణాలకు మరమ్మతులు చేయించాలని ఎన్నిసార్లు మొత్తుకున్నా జీవీఎంసీ అధికారులు పట్టించుకోవడం లేదని వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. టీఎస్ఆర్, డయాస్ ట్యాంక్, ఫ్రూట్‌మార్కెట్ దుకాణ సముదాయాల్లో కనీసం తాగునీరు, మరుగుదొడ్ల వంటి సౌకర్యాలు లేవని వారు చెబుతున్నారు. అయిన 33 శాతం అద్దె పెంపును మాత్రం పక్కాగా అమలు చేస్తున్నారంటున్నారు.

**పరిశీలించి చర్యలు తీసుకుంటాం..**



దుకాణ సముదాయలను పరిశీలించి శిథిలావస్థలో ఉన్నవి, నిరుపయోగంగా మారిన దుకాణాలకు సంబంధించి నివేదిక రూపొందిస్తాం. దాన్ని జీవీఎంసీ కమిషనర్ సంపత్ కుమార్‌కు సమర్పిస్తాం. అధికారుల సూచనల మేరకు తదుపరి చర్యలు తీసుకుంటాం.

– ఎం. మల్లయ్యనాయుడు, జీవీఎంసీ జోన్–4 కమిషనర్

## ప్లాస్టిక్‌ను నిషేధిద్దాం



ప్లాస్టిక్‌కు వ్యతిరేకంగా ర్యాలీ నిర్వహిస్తున్న జెడ్సీ మల్లయ్యనాయుడు తదితరులు

**జగదాంబ:** పర్యావరణానికి హాని కలిగించే ప్లాస్టిక్‌ను నిషేధిద్దాం అని జీవీఎంసీ జోన్–4 కమిషనర్ ఎం.మల్లయ్యనాయుడు అన్నారు. గురువారం 35వ వార్డు పూర్ణామార్కెట్ వద్ద ప్లాస్టిక్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. జనవరి 1 నుంచి ప్లాస్టిక్ నిషేధించినట్లు తెలిపారు. ప్లాస్టిక్ వల్ల క్యాన్సర్ వ్యాధి ప్రబలుతుందన్నారు. ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయంగా గన్నీ బ్యాక్‌లు, మొక్కజొన్నతో తయారు చేసిన కవర్లు, పేపర్‌ప్లేట్లు, పేపర్ గ్లాస్‌లు ఉపయోగించాలన్నారు. ప్లాస్టిక్ అమ్మకాలు చేపట్టిన వారిపై మొదటిసారి రూ. 20 వేలు, రెండవసారి రూ. 40 వేలు జరిమానా విధించనున్నట్లు తెలిపారు. నెలరోజుల పాటు అవగాహన కార్యక్రమాలు నిర్వహించి ఫిబ్రవరి 1 నుంచి పూర్తిస్థాయిలో నిషేధం అమలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంహెచ్‌వో కృష్ణంరాజు, శానిటరీ సూపర్‌వైజర్ కిశోర్, ఇన్‌స్పెక్టర్లు, సెక్రటరీలు, వ్యాపారులు తదితరులు పాల్గొన్నారు.

## పాడేరు సీనియర్ అకౌంటెంట్ సస్పెన్షన్

**మహారాణిపేట:** ట్రెజరీలో పని చేస్తున్న ఒక ఉద్యోగిని సస్పెండ్ చేశారు. సీఎఫ్ఎంఎస్‌లో డబుల్ ఎంట్రీ కారణంగా ఒక ట్రెజరీ అకౌంటెంట్‌పై వేటు పడింది. అలాగే డబుల్ ఎంట్రీని సిఫారసు చేసిన సబ్ ట్రెజరీ అధికారి (ఎస్‌టీవో) గణేష్‌కు షోకాజ్ నోటీసు జారీ చేశారు. పెదబయలు ఎంఈవో జీపీఎఫ్ నిధుల బిల్లును ఒకసారి సీఎంఎఫ్‌లో పెట్టారు. ఇదే బిల్లును మళ్లీ పెట్టడంతో ట్రెజరీ శాఖ ఉన్నతాధికారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ బిల్లును సీఎఫ్ఎంఎస్‌లో పెట్టిన పాడేరు సీనియర్ అకౌంటెంట్ బెనర్జీని సస్పెండ్ చేసి ఎస్‌టీవో గణేష్‌కు షోకాజ్ నోటీసు జారీ చేసినట్టు విశాఖ జిల్లా ట్రెజరీ అధికారి (ఇన్‌చార్జి) గోవిందరావు తెలిపారు.

# పారిశుద్ధ్య పనుల పరిశీలన



పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న కమిషనర్ సంపత్‌కుమార్

**దాబాగార్డెన్స్:** ప్రధాని మోదీ విశాఖలో పర్యటించిన ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టి శుభ్రపరచాలని జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్ అధికారులను ఆదేశించారు. జోన్–3 పరిధి సిరిపురం జంక్షన్ నుంచి వేంకటాద్రి వంటిల్లు మీదుగా ప్రధాని మోదీ రోడ్‌షో జరిగిన ప్రాంతాలను అధికారులతో కలిసి కమిషనర్ పరిశీలించారు. రోడ్ షో సమయంలో గుంతలు పడకుండా, మరమ్మతులకు గురి కాకుండా సులభంగా అతికించి తొలగించుకునేలా బారికేడ్లను వినూత్నంగా ఏర్పాటు చేసినందుకు ఇంజినీరింగ్ అధికారులను కమిషనర్ అభినందించారు. కార్యక్రమంలో ప్రధాన ఇంజినీర్ శివప్రసాదరాజు, జోనల్ కమిషనర్ శివప్రసాద్, పర్యవేక్షక ఇంజినీర్ పీవీ సత్యనారాయణరాజు, కార్యనిర్వాహక ఇంజినీర్ గంగాధర్, సహాయ వైద్యాధికారి బి. ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.



సే నో టు ప్లాస్టిక్ స్టిక్కర్ అంటిస్తున్న కమిషనర్

**సే నో టు ప్లాస్టిక్ స్టిక్కర్లు అంటించిన కమిషనర్..**

విశాఖను ప్లాస్టిక్ ఫ్రీ సిటీగా తీర్చిదిద్దడమే ప్రథమ లక్ష్యమని జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్ తెలిపారు. జోన్–3 పరిధి ఆర్టీసీ కాంప్లెక్స్ ఎదురుగా గల సాయికృష్ణా పార్లర్ దుకాణంలో 'సే నో టు ప్లాస్టిక్'స్టిక్కర్‌ను వార్డు కార్పొరేటర్ గొలగాని వీరారావు, జీవీఎంసీ అధికారులతో కలిసి అతికించి అవగాహన కల్పించారు. అనంతరం జూమ్ యాప్ ద్వారా వార్డు కార్యదర్శులతో మాట్లాడుతూ గురువారం నుంచి సంక్రాంతి లోగా అన్ని దుకాణాల్లో ఈ స్టిక్కర్లు అతికించి, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువులు వినియోగించరాదని ప్రజలు, వ్యాపారులకు అవగాహన కల్పించాలన్నారు. 'ఐ సపోర్ట్ ప్లాస్టిక్ ఫ్రీ వైజాగ్', 'సే నో టు ప్లాస్టిక్'అనే నినాదంతో ఏర్పాటు చేసిన ర్యాలీలో అదనపు కమిషనర్ ఆర్. సోమన్నారాయణ, ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్‌కుమార్, జీవీఎంసీ యూసీడీ విభాగం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## బల్లిగిరికి వైకుంఠ శోభ



ముస్తాబైన ఉత్తరద్వారం



అందంగా ముస్తాబైన బల్లిగిరి ప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవాలయం

**అల్లిపురం:** బల్లిగిరి వైకుంఠ శోభ సంతరించుకుంది. ఈ ఆలయం స్వయంభూ ఉత్తర ద్వారంలో వెలసిన కారణంగా విశేషమైన ఆలయంగా ప్రసిద్ధి చెందింది. దీంతో ఈ ఆలయానికి భక్తుల తాకిడి కూడా అధికంగా ఉంటుందని భావించి ఆలయం అందంగా ముస్తాబవుతోంది. ఉత్తర ద్వార దర్శనానికి ఆలయ వర్గాలు ఏర్పాట్లు చేశాయి. తెల్లవారు జాము 4 గంటల నుంచి వెంకన్న ఉత్తర ద్వార దర్శనానికి సర్వం సిద్ధమైందని ఆలయ ఈవో జీవీ రమాబాయ్ తెలిపారు. దేవాలయాన్ని పూలమాలికలు, మామిడి తోరణాలతో విశేషంగా అలంకరించారు. తెల్లవారు జాము 3 గంటలకు స్వామివారి తిరువీధి ఉత్సవం వైభవంగా చేపట్టనున్నట్లు తెలిపారు. ఆలయ మండపంలో స్వామివారు శేషపాన్పుపై భక్తులకు దర్శనమివ్వనున్నట్లు ఆలయ అర్చకుడు గొడవర్తి రఘునాథాచార్యులు తెలిపారు.

**అలివేలు మంగమ్మ ఆలయంలో..**

అలివేలు మంగమ్మ ఆలయంలో అమ్మవారితో పాటు గోదాదేవిని దర్శించుకునేందుకు ఉత్తరద్వార దర్శనాలకు ఏర్పాట్లు చేసినట్లు ఆలయ అర్చకులు కేశవాచార్యులు తెలిపారు.

## పండగ పూటా పస్తులేనా?

### వాహనాలు ఆపేసి నిరసన తెలిపిన క్లాప్ వాహన డ్రైవర్లు



నిరసన తెలుపుతున్న వాహన డ్రైవర్లు

**దాబాగార్డెన్స్:** జీవీఎంసీ అవుట్ సోర్సింగ్ వాహన డ్రైవర్లు జీతాలందక లబోదిబోమంటూ గురువారం టౌన్ కొత్తరోడ్డు సూయిజ్‌ఫాం వద్ద వాహనాలు నిలిపివేసి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జీవీఎంసీ 8 జోన్లలో సుమారు 600 నుంచి 700 మంది వాహన డ్రైవర్లు ఉన్నారని, విధుల్లో చేరిన నాటి నుంచి ఏ నెలా సక్రమంగా జీతాలు అందుకోలేదన్నారు. రెండు నెలలకోసారి జీతాలు ఇస్తున్నారని, నవంబర్, డిసెంబర్‌కు చెందిన జీతాలు ఇప్పటి వరకు ఇవ్వకపోతే సంక్రాంతి పండగ ఎలా జరుపుకోవాలని ఆవేదన వ్యక్తం చేశారు. మరికొంత మంది మూడు నెలల జీతాలు బకాయిలున్నాయని, సూపర్‌వైజర్ల విషయానికొస్తే గత 7 నెలలుగా జీతాలే ఇవ్వలేదని వాపోయారు. నెలలో 26 రోజులు మాత్రమే డ్యూటీలు ఉంటాయని, ఎప్పుడైనా సెలవు పెడితే ఆ రోజు జీతం కట్ చేస్తారని, మొత్తంగా చూసుకుంటే నెలకు రూ.10 వేలు రావడం కష్టంగా ఉందని తెలిపారు. పీఎఫ్, ఈఎస్ఐ అంటూ జీతాల్లో కోత పెడుతున్నారని, జీతాల్లో కట్ చేసిన మొత్తానికి స్లిప్పులు కూడా ఇంత వరకూ ఇవ్వలేదని చెప్పారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తమ జీతాలు మాకు ఇప్పించేలా చూడాలని వేడుకున్నారు.

# అలరించిన సంక్రాంతి సంబరాలు



ఎంజీఎం హైస్కూల్లో భోగి మంటల వేడుకల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు



రంగవల్లుల వద్ద విద్యార్థినులు, ఉపాధ్యాయులు



సాంప్రదాయ వస్త్రధారణలో రవీంద్రభారతి చిన్నారులు

**అల్లిపురం:** ప్రభుత్వ పాఠశాలల్లో సంక్రాంతి సందడి ముందుగానే వచ్చింది. డాబాగార్డెన్స్‌లో గల మహాత్మాగాంధీ మున్సిపల్ హై స్కూలు ఆవరణ పండగ వాతావరణాన్ని సంతరించుకుంది. విద్యార్థులు సంక్రాంతి ముగ్గులు వేసి పాటలతో ఆకట్టుకున్నారు. భోగి మంటలు వేసి ఉత్సాహంగా గడిపారు. వారితో పాటు ఉపాధ్యాయులు హుషారుగా గడిపారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆర్‌వీవీఎస్ నాగభూషణం మాట్లాడుతూ తెలుగు ప్రజలకు ఎంతో ఇష్టమైనది సంక్రాంతి పండగ అని తెలిపారు. అందరికీ సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు.

**రవీంద్రభారతి స్కూల్లో..**

డాబాగార్డెన్స్‌లోని రవీంద్రభారతి స్కూల్లో సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు సంప్రదాయ వస్త్రాలంకరణలో ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉత్తరాంధ్ర జోనల్ ఇన్‌చార్జి ఎస్.వెంకటేష్, ప్రిన్సిపాల్, డీన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

**రంగోలీ సంబరాలు..**

**దాబాగార్డెన్స్:** సంక్రాంతి పండగను పురస్కరించుకుని పూర్ణామార్కెట్ మెయిన్‌రోడ్డు టర్నర్ చౌల్ట్రీ జంక్షన్ వద్ద గల రిలయన్స్ సెంట్రల్లో రెండు రోజుల పాటు రంగోలీ సంబరాలు నిర్వహించనున్నట్టు సంస్థ ప్రతినిధులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 11, 12 తేదీల్లో మధ్యాహ్నం 2 నుంచి రాత్రి 8 గంటల వరకు పెద్ద ఎత్తున నిర్వహించనున్న రంగోలీ పోటీల్లో నగర వాసులు పాల్గొని తెలుగు వారి సంస్కృతీ సంప్రదాయాలు ఉట్టి పడేలా ముగ్గులు వేసి విజేతలుగా నిలవలన్నారు.

# యువతరం ముందడుగు వేయాలి



స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, సెట్విస్ సీఈవో సత్యపద్మను సత్కరిస్తున్న అతిథులు



మాట్లాడుతున్న సంఘ సేవకుడు సత్యనారాయణరాజు. చిత్రంలో స్వామి వివేకానందుని వేషధారణలో చిన్నారులు

**దాబాగార్డెన్స్:** వివేకానందుని స్ఫూర్తితో యువతరం ముందడుగు వేయాలని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, సెట్విస్ సీఈవో ఎం. సత్యపద్మ పిలుపునిచ్చారు. స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని నెహ్రూ యువ కేంద్రం, సెట్విస్ సంయుక్త ఆధ్వర్యంలో ఏవీఎన్ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో గురువారం కార్యక్రమం నిర్వహించారు. పాల్గొన్న ఆమె మాట్లాడుతూ లక్ష్యానికి చేరుకోవాలనే తపన యువతలో ఉండాలని, అప్పుడే మంచి భవిష్యత్ ఉంటుందన్నారు. మత్తు పదార్థాలకు యువత బానిసవుతుందని, దానికి దూరంగా ఉంటూ అంచెలంచెలుగా ఎదగడానికి కృషి చేయాలన్నారు. కళాశాల ప్రిన్సిపల్ ఎం. సింహాద్రినాయుడు మాట్లాడుతూ పోటీ ప్రపంచంలో రాణించాలంటే చదువుతో పాటు వివిధ రంగాలపై యువత అభిలాష పెంచుకుని పని చేయాలన్నారు. స్వామి వివేకానంద జయంతి ఉత్సవాల సందర్భంగా యువతలో ఉత్సాహం, వృత్తి నైపుణ్యం, పోటీ ప్రపంచంలో రాణించే విధానాలపై రీసోర్స్ పర్సన్ ఎస్‌పి బాబు వివరించారు. ఈ సందర్భంగా సెట్విస్ సీఈవో సత్యపద్మను సత్కరించారు. కార్యక్రమంలో జువాలజీ హెచ్‌వోడీ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామింగ్ ఆఫీసర్ డాక్టర్ ఎ. అర్చన, ఇంగ్లీషు హెచ్‌వోడీ పైడి రజని, వైస్ ప్రిన్సిపాల్ కృష్ణకుమారి, ఎన్‌వైకే ప్రతినిధి లీలాప్రసాద్, వివిధ విభాగాల అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

**స్వామి వివేకానంద జయంత్యుత్సవాలు ప్రారంభం..**

పాతనగరంలో గల స్వామి వివేకానంద స్వచ్ఛంద సంస్థలో గురువారం వివేకానందుని జయంత్యుత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. గాయత్రి హోమంతో ఉత్సవాలను ప్రముఖ సంఘ సేవకుడు ఎం. సత్యనారాయణరాజు, వేణుగోపాల్ ప్రారంభించి వివేకానంద, రామకృష్ణ పరమహంస, శారదా మాత చిత్రపటాలకు పూలమాలలు వేశారు. అనంతరం నిర్వహించిన డ్రాయింగ్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా అప్పలాచారి బృందంచే సంకీర్తన నామాలు, భజన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు స్వామి వివేకానంద వేషధారణలో అలరించారు. ఈ నెల 12 వరకు అన్నదాన కార్యక్రమాలతో పాటు సాంస్కృతిక, సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు సంస్థ అధ్యక్షుడు సూరాడ అప్పారావు తెలిపారు. కార్యక్రమంలో సీహెచ్ ఎల్లాజీ, నల్లరాజు, దానయ్య, భానోజీరావు, సంస్థ మహిళా సభ్యులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## తక్షణం చర్యలు తీసుకోవాలి

**సీతమ్మధార:** తిరుమలలో వైకుంఠ ఏకాదశి దర్శనానికి సంబంధించిన టోకెన్ కౌంటర్ల దగ్గర భక్తులను పశువుల దొడ్డిలో కుక్కినట్లు కుక్కి ఆరుగురి ప్రాణాలు పొట్టన పెట్టుకున్న బేకార్ నాయుడు టీటీడీ చైర్మన్‌గా ఒక్క నిమిషం కూడా కొనసాగడానికి వీల్లేదని జన జాగరణ సమితి రాష్ట్ర కన్వీనర్ ఎస్ఎల్ఎన్. వాసు డిమాండ్ చేశారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన టీటీడీ చైర్మన్, ఈవో, ఏఈవోలను తక్షణమే అరెస్ట్ చేసి జైల్లో పెట్టాలన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మొదటి సంవత్సరమే తిరుమలలో వైకుంఠ ఏకాదశి దర్శన ఏర్పాట్లలో పూర్తిగా అట్టర్ ఫ్లాప్ అయిందని మండిపడ్డారు. టీటీడీని రాష్ట్ర ప్రభుత్వ కబంధ హస్తాల నుండి విముక్తి చేసి నిర్వహణ బాధ్యతలను చిన్న జీయర్ స్వామికి అప్పగించాలన్నారు.

## మృతులకు కోటిన్నర పరిహారం అందించాలి

**అల్లిపురం:** తిరుపతిలో వైకుంఠ ద్వార దర్శనాల టికెట్ల విక్రయాల సందర్భంగా జరిగిన తొక్కిసలాటలో మృతులకు కోటిన్నర నష్టపరిహారం అందజేయాలని వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి, న్యాయవాది పాకా సత్యనారాయణ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఘటనకు దేవస్థానం చైర్మన్ బాధ్యత వహించి తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని ఆయన కోరారు. గాయ పడిన వారికి ఉచితంగా మెరుగైన వైద్యంతో పాటు రూ.50 లక్షలు పరిహారంగా అందించాలన్నారు.